"ఏ తతంగానికయినా నా అభ్యంతరంలేదు" అని అతను పక్కున నవ్వేడు.

నేనన్న దేమిటి? అతను అర్థం చేసుకున్న దేమిటి? అతను మరోసారి నవ్వేడు.

"ప్రేమ! ఈ ప్రేమ అంటే ఏమిటో ఇప్పటి కింకా నాకు సరిగ్గా అర్థంకాలేదంటే నమ్మండి. ప్రేమ వివాహాలు అని చెప్పబడేవాటిని చాలా చూశాను. పెళ్ళికాగానే ఆ ప్రేమ అన్నదల్లా రెక్కలువచ్చి ఎటో ఎగిరిపోవడమూ గమనించేను. నా ఉద్దేశంలో పెళ్లి అంటే ఒక కంట్రాక్టు. అంటే మీరా ఉత్తరములో రాసినట్టే అన్నమాట. నేను మీకు ధనసహాయంచెయ్యడం, మీ పోషణ భారం వహించడం, మీరు నా ఇల్లాలుగా నా యిల్లూ వ్యవహారం చక్కబెట్టడం. ఇందులో "ప్రేమ"అన్నది లేనందువల్ల వచ్చిన ఇబ్బంది ఏమిటో చెప్పండి."

"మీకు ప్రేమ అంటే ఏమిటో తెలీదంటే ఆశ్చర్యంగానే వుంది."

"మీరు అవకాశం యిస్తే నేర్చుకుందామనే వుంది." చిన్ననవ్వు.

నేను లేచి నిలబడ్డాను. అతనూ లేచి నిలబడ్డాడు.

"మిస్ పాత్రో, మనపరిచయం ఇంతవేగంగా తుంచివేయడం భావ్యంగా కన్పించడంలేదు. నేను ఇంకా రెండువారాలపాటు వుంటానీ పట్నంలో. ఇవాళ డిసెంబరు 16, మంగళవారం. ఓ వారం రోజులపాటు మీరు రోజూ సాయింత్రం ఈ పాటివేళకు ఈ హోటలుకివచ్చి నాతో ఫలహారం చెయ్యడానికి అంగీకరిస్తే సంతోషిస్తాను. ఈ వారంలోపున ఒకరినొకరం బాగా అర్థంచేసుకుం దికి వీలవుతుంది. ఆ తర్వాత మన యిష్టాయిష్టాల బట్టి వుంటుంది... మీ రెలాగా వుద్యోగంకోసం ప్రయత్నిస్తున్నానన్నారు. ఇక్కడ నాకు తెలి సిన ఆఫీసర్లు కొంతమంది వున్నారు. ఎక్కడ యినా ఉద్యోగాలు ఖాళీలున్నాయేమో కను క్కుంటాను. ఇంక సెలవు. నమస్తే."

"థేంక్సు. నమస్తే."

బుర్రనిండా ఆలోచనలతో మెట్లు దిగివచ్చే శాను.... మాటతప్పిపోయినాను నిజమే. కాని చూస్తూచూస్తూ ఈ గడ్డాలబూచిని ఎలా పెళ్ళా డేది?

(ఇంకావుంది)

---

స్కెచ్

# 'సామాన్యమానవుడు'

ఎమ్. రామనాథ్

"సామాన్యమానవుని భుజస్కంధాలపై సమస్తభారం పడుతుంది."

——అన్న ఆధునికకవి గేయం చదివిన తర్వాత నిత్యమూ వినే రాజకీయనాయకుల ఉప న్యాసాల్లోనూ; చదివే కథల్లోనూ, గేయాల్లోనూ సర్వాంతర్యామిగా వ్యాపించిన యీ "సామాన్య మానవుడు" ఎవరు? ఎలా వుంటాడు? ఎక్కడ వుంటాడు? అన్న సందేహాలు నన్ను వేధించ సాగాయి.

లోకంలో ప్రతికొత్తవస్తువూ నన్నుఆకర్షించి తన లోతులు తెలుసుకోమన్నట్లు నా కగుపించ టంతో ... ప్రతి చిన్న విషయమూ ఓ సమ స్యగా మారి—సమాధానం పొందేవరకూవిశ్రాంతి పొందేవాణ్ణి కాదు. అందుకనే నాన్న అంటుండే వారు "వెధవా! నీకన్నీ సందేహాలే!" అని. అవునుమరి "సూర్యుడు తూర్పునే ఎందుకు ఉద యిస్తాడు? భూమి గుండ్రంగానే ఎందుకుంది?" అలాంటి మింగుడు పడని ప్రశ్నలకు ఎదుర్కో వలసి వచ్చేసరికి ఎవరుమాత్రంఏమంటారు? ఇలా కొరకరాని ప్రశ్నలనే కాక మరో దీర్ఘసమస్యనే ఆయన ఎదుర్కోవలసివచ్చింది. అది నాఉద్యో గమూ, భవిష్యత్తులతో ముడిపడి వుండటంతో నాకుగా నేనే ఒక సమస్యగా తయారై ఆయన ఎదుట కూర్చున్నాను.

ఎలాయినా యీనాడు ఉదయించిన సరికొత్త సందేహానికి సమాధానం పొందాలి. ఎవరినుండి?

నా స్మృతిపథంలో లీలగా శంకరరావుగా గోచరించాడు. అవును మాలోకల్లా శంకరరావుకొంచెం వైజ్ఞానికంగా జాతీయ హద్దులను ఇప్పుడిప్పుడే దాటుతున్నాడు. హా; ఇలియట్ లనయినా కనీసం తన సంభాషణలో చొప్పించి విడువండే నిద్రపోయే ఘటం కాదుకాబట్టి. ఒక శుభోదయాన 'పవర్ హౌస్' బస్సుస్టాపువద్ద అతని సాన్నిధ్యాన్ని చేరి,

"ఏరా..." అని ఆగిపోగా- నా దీనావస్థను చూచి దిగులుపొందినవానిలా సాదరపూర్వకంగా వీపు నిమురుతూ-

"ఏమిటిరా విషయం?"

"అహా! ఏమీ లేదురా. కథల్లోనూ కవిత్వంలోనూ చివరకు ఉపన్యాసాల్లోనూ చూస్తామే సామాన్య మానవుడని ఎవర్రా యీతడు? ఎక్కడ వుంటాడు?ఎలా..."

శంకరరావు మొఖం విప్పారిన కమలమైంది. పెదవులపై లేతచిరునవ్వు నడయాడుతోంది - నా అదృష్టరేఖ పండింది జ్ఞానముముక్షువునై చరిస్తున్న నాకు శంకరరావువద్ద ముక్తిలభించే మార్గం గోచరించింది.

"హాఁ! నీదుంపతెగ-ఇదేనట్రా? పెద్ద సందేహమే వచ్చింది!"

"అహా! అదికాదురా!"

"ఏదికాదురా! తెలివితక్కువదద్దమ్మా యీ మాత్రం అర్థంచేసికోలేవురా?"

"అసలూ - ఎలా - -"

"ఎలావుండేదేమిటి - ఎక్కడ వుండేదేమిటి. ఒకచోటనేదేముంది. ప్రతిచోటా! ట్రాముల్లో. సిటీబస్సుల్లో. ఎంప్లాయ్ మెంట్ ఎక్ఛేంజి ఆఫీసుల ప్రాంగణాలలో. 'కలక్టరేటు' నీలిసీడల్లో. ఓహ్. ఒకచోటనే దేముంది? నీలో -నాలో - నూటికి తొంభైమంది భారతీయుల్లో తనమూర్తినే ప్రసరిస్తూ - -"

"అబ్బా! చాలురా. నీ ఉపన్యాసం.."

"ఉపన్యాసంకాదురా. వాస్తవిక విషయం - కళ్లెదుట కనపడే నగ్నసత్యం" అంటమేమిటి ఇంతలోకే యమదూతలా "సిటీబస్సు" రావటమేమిటి-బస్సులోకి తన భౌతిక కాయంతోపాటు "ఈవినింగ్ ఇన్ పారిస్" సెంటువాసనలను కూడా చేర్చటమేమిటి క్షణంలో జరిగి నేనిచ్చిన సమస్యనే - మరింత క్లిష్టతరంచేసి నామొహాన విసిరేసి జారుకున్నాడు.

* * *

ఆ సాయంత్రమే "మిడ్ లాండ్" నుండి "గ్యాస్ లైట్" చూచివస్తూన్న నన్ను చిర కాల మిత్రుడు రాఘవరావు "మైకాఫీబార్" కు తిన్నగా తీసుకెళ్ళాడు. రాఘవరావు పత్రికా రచయితగా కాస్తోకూస్తో పేరున్నవాడు. ప్రస్తుతం ఒక దినపత్రికా కార్యాలయంలో పనిచేస్తూ ఇతోధిక సాహిత్య అభివృద్ధికి కృషిచేస్తున్నాడు. అలాటి మేధావిని చూడగానే నన్నెదుర్కొన్న ప్రశ్న కొత్తచిగుళ్ళతో మోసులెత్తింది.

రాఘవరావు ప్రత్యేక ఆహ్వానంపై- ముందు బిల్లు చెల్లించే ప్రమాదము నేను ఎదుర్కోవలసి వస్తుంది అని తెలిసికూడా- రాఘవరావువెంట పోయి-ఓ మారుమూల 'ఆల్ ఇండియా రేడియో' వినిపించే శ్రావ్య సంగీతమునకు తీతంగా కూర్చొని "ఏమిట్రా రామా! విశేషాలు" అన్న రాఘవరావు ప్రశ్నను సయితం లెక్కించకుండా—

"రఘూ! ఒక్కమాటురా! ఈ ఉపన్యాసాల్లోనూ- కథల్లోనూ చూస్తామే 'సామాన్య మానవుడ'ని అతనెవరురా? ఎలా ఎక్కడ ఏయే సమయాల్లో వుంటాడురా?" అన్నాను.

అంతే రాఘవరావు ముఖంకూడా శంకరరావు ముఖంలా విప్పారింది. ఆ ఎర్రని పెదవులపై ఓ చిరునవ్వు - కాని శంకరరావు ముఖంలో లేని గంభీరత- నిశ్చలత- దానితో అదృష్టదేవతే తుదిసారి వచ్చి మందహాసం చేస్తోందనిపించింది. తనువే కర్తవ్యయంగా మారి రాఘవరావు సమాధానాన్ని నిరీక్షిస్తోంది!

"ఎవ్వరనేదేముందిరా? ఇతమిత్థంగా ఇతడూ అని మనం చెప్పలేకపోవచ్చు. కాని చూడు! అంతమాత్రంతో సామాన్య మానవుని పాత్రే మన జాతీయ జీవనగరంనుండి అదృశ్యమైపోయిందని చెప్పలేము. దరిదాపుగా మన జనాభాలో ఎక్కువభాగం- ఎక్కువభాగం అనేదేముంది? నూటికి ఏ పదిమందినో తప్పిస్తే- పూర్తిగా... అంతదాకా ఎందుకూ-నీలో-నాలో..."

మైగుడ్ గాడ్! అంతే ఆ శంకరరావు సమా

ధ్యానమే మరికొన్ని కూర్పులూ- చేర్పులతో కొత్త పదజాలపు ముసుగులో-కొత్తమనిషిద్వారా వెలువడుతోంది.

"అదికాదురా- స్పష్టంగా ఇలా వుంటాడు. ఫలానచోట- ఫలానసమయంలో అని చెప్పలే వురా?"

"ఆగరా! అంతతొందరే ? ఎక్కడవుంటాడో చూపమంటే ఎలా- అస్తవ్యస్తంగావున్న మన ఆర్థికవ్యవస్థలో అతనిది ఉదురయిన జీవితంకాదా యెను. దారం తెగిపోయిన గాలిపటంలా- తుఫానులో చిక్కిన పిట్టలా- ఒకచోటనేమిటి!..."

"పోనీ! ఆ చోట్లేవో చెప్పరా! ఈ విశ్రాంత రాళ్లోకి ఎగిరయినా సరే!"

"కొయ్యకురా. విను. ఉదయం 9-10గంటల ప్రాంతంలో ఆఫీసువేళల్లో అన్నమాట సిటీబస్సు స్టాపింగులవద్ద - పగలల్లా ఆఫీసులలో-అది సెక్రటేరియట్ కావచ్చు, కలక్టరేటు కావచ్చు కాగితాల్లో తలదూర్చి లేదా-" ఏవేవో అనుధారగా రూపాలను వర్ణించుకుంటూ పోతున్నాడు.

"చాలురా! ఈమాత్రం ఆధారం దొరికితే చాలు - జగత్తంతా గురించి-నా గమ్యస్థానాన్ని చేరుకుని-చేరుకోని ఏవేవో ఆలోచనా తరంగాలు ఉవ్వెత్తుగా లేచి బద్దలై పతనమై పోతున్నాయ్. చెవుల్లో సప్తసముద్రాల ఘోష. కనుకొలుకుల్లో విశ్వమే పరిభ్రమిస్తోంది. బస్సు స్టాపు సెక్రటేరియట్ నీడలు, పేవ్ మెంట్ పైఅనాథులై పశువులకన్న హీనంగా బ్రతికే వాళ్ళూ 'హిందూ'లో వాంటెడ్ కాలమ్సులో దూర్చిన తల..."బెనారస్ శారీ మ్యూజియమ్" లోని షోకేసువంక ఆశతో చూచే రేగినతలతో నిలచిన నిర్మలహృదయం..."గైటీ" లో నాల్గవతరగతి కౌంటర్ వద్ద "అల్లాఉద్దీన్ మాయాలాంతరు" సినిమాకోసం ఉస్త్రీలుపడుతున్న అస్పష్టంగా గోచరిస్తున్న మూర్తులు-అప్రయత్నంగాలేచి కౌంటర్ వద్ద బిల్లా డబ్బూ వదిలి ముందుకుపోతున్నాను. వెనుక "రామూ...రామూ" అన్న కేక స్పష్టంగా వినిపించి మద్రాసు బస్సు గోలల మధ్య కరిగిపోయింది. ఎదురుగా మౌంట్ రోడ్డు పోస్టాఫీసు బస్సుస్టాండు "పేవ్ మెంటు"పైనున్న వేపచెటును ఆనుకొని రెండు సీతాకోక చిలుకలూ; వాటి చుట్టూ గతి తప్పకుండా పరిభ్రమించే "ట్వీడ్ సూటూ! "పేవ్ మెంటు బాబు"నే వరుసలు తీరిన మానవ...చెవిలో ఏదో-సప్తసముద్రాలఘోష... కంటిముందు బ్రహ్మాండమయిన వెలుగూ ఆ వెలుగును వెన్నాడుతూ భీకరశబ్దంతో గాఢాంధకారమూ.

* * *

ఒక మృదుమధుర శీతల కరస్పర్శతో ఎంత సేపటికి నిద్ర మేల్కొంచానో కాని ఎదురుగా వున్న కేలండరు ఒకరోజు ముందుకు జరిగొత్తింది. అటుచూస్తే పేషెంట్సుబెడ్ ఇటుచూస్తే జనరల్ హాస్పిటల్ వార్డు—భయమూ ఆశ్చర్యముతో కంపించిపోతూ.

"నర్స్!...నర్స్!..."

"కమింగ్! ప్లీజ్!"

"నర్స్! నేను ఎలా...ఇక్కడికి..."

"ఎలా గేముంది? అదృష్టవంతులు కాస్తలో ప్రాణాపాయం తప్పింది. ప్రమాద వివరాలు పత్రికలో చదువుతారా?"పత్రికావార్త"మౌంట్ రోడు పోస్టాఫీసు సమీపంలో బస్సు ప్రమాదం- ఒకనికి స్వల్పగాయాలు"అన్న శీర్షికతో ఆరంభమై ఇలా అంతమైంది.

"...ఆకాశంలో చుక్కలను లెక్కిస్తూ; అజాగ్రతగా రోడ్డు దాటుతూవుండగా టి 'నగర్ నుండి పారిస్ పోయే 11వ నెంబరు రూటులోని బస్సు క్రింద 'సామాన్యమానవుడు' ఎవ్వరో పడి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కొద్దిలో ప్రాణాపాయం తప్పింది."

---

జరగబోయే ఫలితాలన్నీ స్పష్టంగా, సందేహానికి తావులేకండా తెలుస్తే గాని ఏ నిర్ణయానికీ రాకూడదనుకుంటే, నువ్వు జన్మలో ఏ నిర్ణయానికీ రాలేవు. జీవితానికి భయపడి పారిపోకండా నిలబడి, పొరపాటును ధైర్యంగా అంగీకరించు.

—ఏమియల్